నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. రాజేంద్రఆయిల్‌మిల్ ఫీడర్ పరిధిలోని ఎంఆర్‌వో ఆఫీస్, సోప్‌ఫ్యాక్టరీ లేన్, అచ్చయ్యనగర్, ఆర్టీసీ కళ్యాణ మండపం తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు... ప్రీవెంటీవ్ మెడిసిన్ ఫీడర్ పరిధిలోని శివాజీనగర్, దుర్గానగర్, రత్నడిగ్రీ కాలేజ్, నారాయణగూడ ఫ్లైఓవర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు... ఫీవర్ ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మచ్చ ప్రభాకర్‌కు నివాళి



మచ్చ ప్రభాకర్ చిత్రపటానికి నివాలులర్పిస్తున్న కందగట్ల స్వామి

కాచిగూడ: పద్మశాలీ సమాజ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన మచ్చ ప్రభాకర్ ప్రథమ వర్ధంతిని నారాయణగూడ పద్మశాలి భవన్‌లో నిర్వహించారు. అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పాల్గొని ప్రభాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పద్మశాలి సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గడ్డం జగన్నాథం, మాచర్ల రామచంద్రరావు, అవ్వారి భాస్కర్, అంబటి శ్రీనివాస్, చిన్ని రాకేష్, గ్యాజంగి లక్ష్మణ్, ఇట్టే చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి ఖండిస్తున్నాం

బీజేవైఎం నేత రాముయాదవ్

కాచిగూడ: నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని బీజేవైఎం స్టడీ సర్కిల్ రాష్ట్ర కన్వీనర్ రాముయాదవ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ దుర్మార్గ రాజకీయాలు చేస్తోందన్నారు. పోలీసుల సమక్షంలోనే ఆ పార్టీ కార్యకర్తలు బీజేపీ కార్యాలయంపై దాడి చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నేతల తీరు మార్చుకోకపోతే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు.

స్కూల్ జోన్స్ వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



కాచిగూడ: మోతీమార్కెట్, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో స్కూల్స్ జోన్స్ వద్ద విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి రబ్బర్ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ ఉమారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ప్రశాంత్, నరేష్, బీజేపీ నేతలు రమేష్ యాదవ్, సుభాష్ పటేల్, రవియాదవ్, బాబన్న, బి.భీమ్‌రాజ్, రవియాదవ్, సంతోష్, రామకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడ కార్పొరేటర్ హౌస్ అరెస్టు



కవాడిగూడ: ఇటీవల బీజేపీ ఎంపీ కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంకాగాంధీపై అనుచిత వాఖ్యాలు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ ఘటనతో దోమలగూడ పోలీసులు ముందస్తుగా కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీని హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్ కార్యకర్తలు వీధిరౌడీల్లా ప్రవర్తించి బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి చేయడం దారుణమన్నారు. అంతే కాకుండా బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు.

అధికారుల అలసత్యం.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.!

- రత్నానగర్‌లో రోడ్డును తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్
- కొంతమేర నిర్మించి మిగిలిన రోడ్డును వదిలేసిన వైనం
- వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని స్థానికుల డిమాండ్
- లేకుంటే జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిక



రత్నానగర్‌లో రోడ్డును తవ్వివదిలేసిన దృశ్యం

నల్లకుంట: అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ అలసత్యం ప్రజల పాలిట శాపంగా మారింది. నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్‌లో 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు డ్రైనేజీ, వాటర్ పైపుల నిర్మాణం కోసం జలమండలి అంతర్గత రోడ్లను తవ్విపోయించింది. పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్ తవ్వి పోసిన రోడ్లకు కొంతమేర సీసీరోడ్డు నిర్మించాడు. మిగిలిన పనులను అలాగే వదిలేశాడు. ఏడాదైనా అలాగే ఉండటంతో స్థానికులు గత నెలలో జీహెచ్ఎంసీ డీఈకి ఫిర్యాదు చేశారు. వెంటనే డీఈ బస్తీలో పర్యటించి సదరు కాంట్రాక్టర్‌కు ఫోన్‌చేసి రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై అడిగి తెలుసుకున్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ క్రమంలో సదరు కాంట్రాక్టర్ గతేడాది డిసెంబర్ 2వ తేదీన ప్రొక్లెయినర్‌తో రోడ్డుపై మట్టిని తొలగింపజేసి వీధిని చదును చేయించారు. రోడ్డు చదును చేసి నెల రోజులు గడిచినా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారని బస్తీవాసులు అంటున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనుల్లో జాప్యం..

తవ్వి పోసిన రోడ్డుతో బస్తీలోని వృద్ధులు, మహిళలు. చిన్నారులు రాకపోకలు సాగించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులు కూడా తమ బస్తీ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయించాలని కాంట్రాక్టర్ మాత్రం అదిగో.. ఇదిగో.. అంటున్నారే కాని రోడ్డు నిర్మాణ పనులు మాత్రం ప్రారంభించడంలేదని బస్తీవాసులు చెబుతున్నారు.

ఎలుకలు, పంది కొక్కుల ఆవాసంగా వీధి..

కాంట్రాక్టర్ రోడ్డును తవ్విపోయించడంతో అక్కడ ఎలుకలు, పంది కొక్కులు ఆవాసం ఏర్పాటు చేసుకుంటున్నాయని బస్తీ వాసులు పేర్కొంటున్నారు. అక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకుంటున్న ఎలుకలు, పంది కొక్కులు గోడలను తొలుచుకుంటూ ఇళ్లలోకి వస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



ముషీరాబాద్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కవాడిగూడ: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీ, ఎంబీసీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని బీజేపీ ముషీరాబాద్ కన్వీనర్ రమేష్‌రాం ఆధ్వర్యంలో ముషీరాబాద్ ఎంఆర్‌వోకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు మాట్లాడుతూ... బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను మర్చిపోయిందని వారు విమర్శించారు. బీసీ, ఎంబీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌ల పెంపు, బీసీ కులగణన, బీసీల సంక్షేమం కోసం ప్రతిఏటా రాష్ట్ర బడ్జెట్‌లో రూ.20వేల కోట్లు కేటాయిస్తామన్నారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని అన్నారు. లేని పక్షంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సదానంద్ ముదిరాజ్, బీజేపీ ఓబీసీ నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పరిమళ్‌కుమార్, సురేష్ ముదిరాజ్, శ్రీనివాస్, మహేందర్‌బాబు, పీఎస్ చారి, గంటా శ్రీనివాస్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ క్షౌర వృత్తిదారుల సంఘం నూతన కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీ రమణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్ర క్షౌర వృత్తిదారుల నూతన కమిటీని మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రసాదం విష్ణు, గౌర అధ్యక్షులుగా జంపాల మనోహర్, జి. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి అవినాష్, ప్రధాన కార్యదర్శిగా చెన్నారం మల్లేష్, సహాయ కార్యదర్శిగా దుర్గా ప్రసాద్, మహిళా అధ్యక్షులుగా ఉమారాణి, సహాయ కార్యదర్శిగా హారితలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ మాట్లాడారు. విద్యుత్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు పి. ఆశయ్య తదితరులు పాల్గొన్నారు.

వృత్తి పనుల శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

లిబర్టీ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్కిల్స్ యూనివర్సిటీలో వృత్తి పనుల శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి కోరారు. యూనివర్సిటీలో గీతా నేత ఇతర సంప్రదాయ కులవృత్తుల పరిశ్రమల అభివృద్ధి సంక్షేమం పరిశోధన, ఉపాధి మార్గాలు శిక్షణ కోర్సులను ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించారు.ఈ సందర్భంగా మంగళవారం దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కనుమరుగవుతున్న కులవృత్తులకు ప్రధానంగా గీత, నేత, కమ్మరి, వడ్రంగి స్వర్ణకారులు వంటి వాటికి శిక్షణా కోర్సులు ప్రవేశపెడితే రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు. అనేకేళ్లుగా తరతరాలుగా సంప్రదాయ కుల వృత్తులను నమ్ముకొని బతుకుబండి లాగుతున్న వృత్తిదారులకు ఉపాధి కల్పించే విధంగా ఆధునీక కోర్సులు ఉండాలని విన్నవించారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ నేపథ్యంలో కులవృత్తులు క్రమంగా కనుమరుగవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో తాత ముత్తాల నుంచి వారసత్వంగా కులవృత్తులు నమ్ముకొని లక్షలాదిమంది బతుకుబండి లాగుతున్నారని కుమారస్వామి గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్కిల్స్ యూనివర్సిటీలో నైపుణ్యం పెంచేందుకు ఆధునీకరణ కోర్సులు ప్రవేశపెట్టి సంప్రదాయ వృత్తులకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిక్కడపల్లి: ముఖ్యమంత్రి సహాయనిధికి కవాడిగూడ, ముషీరాబాద్, రాంనగర్ డివిజన్లకు చెందిన వారు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు రూ.9లక్షల విలువ చేసే 11 చెక్కులు మంజూరయ్యాయి. డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయం ఈవోగా అన్నపూర్ణ



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చిక్కడపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఈవోగా అన్నపూర్ణ నియమితులయ్యారు. ఇక్కడ ఈవోగా పనిచేసిన రామాంజనేయులు కొమురవెల్లి ఆలయానికి బదిలీ కావడంతో అన్నపూర్ణ ఈనెల 4న పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గంగపుత్ర విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గంగపుత్ర విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గంగపుత్ర విజన్-2035 డాక్యుమెంటరీని ప్రొఫెసర్ ఎస్ సుదర్శన్‌రావు, న్యాయవాది పూస మల్లేష్ ఆవిష్కరించారు. అంతకుముందు గంగపుత్ర సంఘం అధ్యక్షుడు సందిరి బాలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రొ. సుదర్శన్‌రావు మాట్లాడుతూ... గంగపుత్రులు విద్యాపరంగా అభివృద్ధి చెందినప్పుడే మంచి గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక ప్రతినిధులు సురేష్ ఆనంద్, మంగిలిపల్లి శంకర్, పి. మల్లేష్, రిటైర్డ్ ఏఎస్ఐ శంకర్, మారంపల్లి భూపతి, కొప్పు లక్ష్మీనారాయణ, చెరుకు బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



సందిరి బాలయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొ. సుదర్శన్ తదితరులు

నేడు పడిపూజ, ఇరుముడి కార్యక్రమం

హాజరుకానున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: శ్రీజవంతీశ్వరస్ అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కేజీఎస్సీ బోసు గురుస్వామి ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన బుధవారం కాచిగూడలోని తుల్జాభవన్‌లో అయ్యప్పస్వామి మహా పడిపూజ, అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పీసీ ప్రదీప్‌నాయుడు గురుస్వామి, లక్కాకుల ప్రవీణ్‌కుమార్ గురుస్వామి, కేపీ యాదగిరి గురుస్వామి తెలిపారు. ఉదయం 5గంటలకు గణపతి హోమంతో ప్రారంభమై పడిపూజ, ఇరుముడి కార్యక్రమం, పడి వెలిగించుట, భక్తులకు, అయ్యప్ప స్వాములకు భిక్ష, అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం 5గంటలకు స్వాముల శబరియాత్ర కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి,ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కార్పొరేటర్లు ఉమారాణి, వై.అమృత, బి.పద్మా వెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య, జి.మహాలక్ష్మి, ఎ.పావని, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వీ మహేందర్ కుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ కేలండర్ ఆవిష్కరణ



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: హైదరాబాద్ నగరంలో త్వరలో 20వేల మంది గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు సాధుల శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రం వద్ద జరిగిన సమావేశంలో 2025 కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం కారోబార్‌లను అసిస్టెంట్ పంచాయితీ కార్యదర్శులుగా నియమించాలన్నారు. జీవో. 51ను ఎత్తివేయాలన్నారు. సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే సదస్సుకు అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల నుంచి కారోబార్‌లు, బిల్లు కలెక్టర్‌లు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తేలుకంటి మురళి, స్వామి, విజయకుమార్, రాజేందర్, అశోక్, ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంకా గాంధీపై బీజేపీ నేతల వ్యాఖ్యలు దారుణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పట్నం నాగభూషణంగౌడ్, స్వప్న

ముషీరాబాద్: బీజేపీ నేతలు రాజకీయ లబ్ధికోసం కాంగ్రెస్ అగ్రనాయకురాలు, ఎంపీ ప్రియాంకా గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ బి-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షులు పట్నం నాగభూషణం గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ముషీరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నేత రమేష్ బీదూరి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శాంతియుత నిరసన తెలిపితే బీజేపీ నాయకులు కట్టెలు, రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. దాడులు చేయడంతో పాటు గాంధీభవన్ ముట్టడికి యత్నించడం, ఫ్లెక్సీలు చింపేయడం, ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా కమిటీ సేవాదళ్ అధ్యక్షురాలు స్వప్నాగౌడ్, పార్టీ నాయకులు అమరేందర్, ప్రేమ్‌కుమార్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు ఫోన్‌లో సమస్యను చూపిస్తున్న అక్లక్ హుస్సేన్ తదితరులు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అక్లక్‌హుస్సేన్ ఆయనను కలిసి భోలక్‌పూర్‌లో నెలకొన్న సమస్యలను వివరించారు. అనంతరం డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... అభివృద్ధి పనుల కోసం కావాల్సిన నిధులను విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాహెద్ ఆలీ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ ఫలాలు పొందారని నిరూపిస్తే రూ.30 లక్షల రివార్డు

మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్

పంజగుట్ట: ఇటీవల బీసీ నాయకులు ఎమ్ఆర్‌పీఎస్‌కు మద్దతు తెలుపుతూ మాల కులస్తులను తప్పు పడుతూ ఎస్సీ ఫలాలు మొత్తం మాల కులస్తులే పొందుతున్నారని అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భవించిన 2 జూన్ 2014 నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్, ఎస్సీ కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్, సాంస్కృతిక రథసారధి సంస్థల్లో అమలైన పథకాల్లో మాదిగలకన్నా మాల కులస్తులు ఎక్కువ లబ్ధిపొందారని నిరూపిస్తే రూ. 30 లక్షల రివార్డు ప్రకటిస్తామని ఆయన సవాల్ విసిరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రివార్డుకు సంబంధించిన రూ. 30 లక్షల డీడీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సమత సైనిక్ గల్ సౌత్ ఇండియా అధ్యక్షులు దిగంబరి కాంబ్లే, ప్రజానాయకుడు రేంజర్ల రాజేష్, ఆర్టీసీ మాల ఉద్యోగుల సంఘం నాయకులు దాసరి లక్ష్మయ్య, ఆనపూసల వెంకటేష్‌లు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కొంత మంది బీసీ నాయకులు మద్దతు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, అదే సమయంలో మాల కులస్తులను స్మగ్లర్లు, ఎస్సీ ఫలాలు మొత్తం వారే దోచుకుతిన్నారు అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. గాలి మాటలు మాట్లాడకుండా గత 10 సంవత్సరాల నుంచి ప్రభుత్వ పథకాల్లో ఎవరు ఎక్కువ లబ్ధి పొందారో ఆధారాలు ఉంటే 15 రోజుల్లో ఇవ్వాలని అన్నారు. ఇకపై మాల కులస్తులపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెట్లపల్లి అరుణ్‌కుమార్, రవీందర్, చొక్కంపేట ఆజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామికవాదులపై మతోన్మాద దాడులు

ముషీరాబాద్: తెలంగాణలో కొన్ని రోజులుగా ప్రగతిశీల రచయితలు, మేధావులు, ఉపాధ్యాయులపై మతోన్మాద గుండాల దాడులు పెరిగిపోతున్నాయని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో కొందరు వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్‌పై దాడి చేయడం దారుణమన్నారు. ఆ తర్వాత కూడా బెదిరింపు కాల్స్, సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేస్తున్నారని అన్నారు. రచయిత్రి మెర్సీ మార్గరైట్‌పై కూడా ఇదే విధంగా మతోన్మాదులు పెట్రేగిపోయారని అన్నారు. ప్రధాన ఉపాధ్యాయులు రాములుపై కూడా తన విధి నిర్వహణలో ఉండగా పాశవిక దాడికి పూనుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేణుగోపాల్, మెర్సీ మార్గరెట్ సమాజాన్ని ప్రగతిశీల భావజాలం వైపు నడిపించేందుకు అనేక విలువైన రచనలు, పుస్తకాలను అందించారని తెలిపారు. ఈ దుర్మార్గమైన చర్యలను సీపీఐ(ఎంఎల్) న్యూ డెమాక్రసీ ఖండిస్తుందన్నారు. ఫాసిజం విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమానికి అన్ని శక్తులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ దాడులపై ప్రభుత్వ యంత్రాంగం కనీసంగా స్పందించకపోవడం దారుణమని అన్నారు.



ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

అంబర్‌పేట: అటల్ బిహారి వాజ్‌పేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను మంగళవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ చైర్మన్ కావ్య కిషన్‌రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు ముఖ్యఅతిథిలుగా హాజరై ముగ్గులను పరిశీలించారు.ఈ ముగ్గులపోటీల విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.ఈ పోటీల్లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కుట్టుమెషిన్, అల్లికలు, బ్యూటీషియన్ శిక్షణ కేంద్రాల మహిళలు పాల్గొన్నారు.

మనోరంజకంగా సంగీత విభావరి

చిక్కడపల్లి: వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) ఆధ్వర్యంలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్, సావిత్రి, జమునలకు స్వర నీరాజనం కార్యక్రమాన్ని మంగళవారం త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా వారు నటించిన చిత్రాల్లోని పాటలను గాయకులు పాడారు. ఈ సినీసంగీత విభావరి మనోరంజకంగా సాగింది. అనంతరం జరిగిన సమావేశంలో ప్రముఖ గాయని రేణుకా రమేష్‌కు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డు-2025 ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వైఎస్ రామకృష్ణ, సుధాదేవి, శైలజ, లలిత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తిగత శుభ్రత పాటించాలి



ముషీరాబాద్: బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు సంధ్యారాణి అన్నారు. మంగళవారం జమిస్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా శానిటరీ న్యాప్‌కిన్స్‌ను పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. బాలికలు మంచిగా చదుకుని అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మశ్రీ, వాణి తదితరులు పాల్గొన్నారు.